క్లుప్తంగా

నేడు నెలపర్తిపాడులో 'స్వచ్ఛత-మన బాధ్యత'

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో శనివారం మధ్యాహ్నం 2.30కు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో స్వచ్ఛత-మన బాధ్యత కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

అపరిశుభ్రతే అంటు వ్యాధులకు కారణం



గొల్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

కాజులూరు: అంటు వ్యాధులు ప్రబలేందుకు అపరిశుభ్రతే కారణమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. గొల్లపాలెంలో సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక ఆధ్వర్యంలో శుక్రవారం అధికారులు, నాయకులు స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఉపాధిహామీ కూలీలు గ్రామంలో చెత్తను, రోడ్ల వెంబడి ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. నాయకులు, అధికారులు శ్రమదానంతో వీధులను శుభ్రం చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, వీఆర్వోలు ఈశ్వర్రావు, సత్తిబాబు, పెంటపాటి శ్రీను, మాత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ జాబితాల్లో అభ్యంతరాలు సరిచేసుకోండి



గ్రామసభలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారి

రామచంద్రపురం రూరల్: ఈ-క్రాప్ జాబితాల్లో అభ్యంతరాలుంటే సరిచేసుకోవాలని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని వెల్ల గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం గ్రామసభ జరిగింది. గ్రామంలో 1,038 మంది రైతులకు 1,408 ఎకరాల్లో పంట నమోదు చేసినట్టు వెల్లడించారు. అలాగే 1,011 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకున్నట్టు చెప్పారు. రైతులు తమ అభ్యంతరాలను ఈ నెల 29లోగా గ్రామ సభల్లో రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. వాటిని సరిచేసి నవంబరు ఒకటిన తుది జాబితా రూపొందిస్తారని తెలిపారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న వారి సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు. నమోదు పత్రాన్ని రైతులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు బొంతు పుల్లయ్య, గుత్తుల రామప్రసాద్, తోట వీరభద్రరావు, వీఏఏ పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు మంత్రి వేణు పర్యటన

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం యనమదల గ్రామంలో శనివారం ఉదయం 9.30కు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొంటారని ఆయన అడిషనల్ పీఎస్ పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6కు రామచంద్రపురం పట్టణంలో గుడ్ మార్నింగ్ రామచంద్రపురం కార్యక్రమం, 10.30కు నరసాపురపుపేటలో ఇళ్ల పట్టాల పంపిణీ, 3 గంటలకు రామచంద్రపురం మండలం నెలపర్తిపాడులో, 3.30కు కె.గంగవరం మండలం కుందూరులో స్వచ్ఛతే మన బాధ్యత కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని తెలిపారు.

'భవిష్యత్తుకు గ్యారంటీ'ని విజయవంతం చేయాలి

మండపేట: నవంబరు ఒకటి నుంచి మొదలు కానున్న బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు టీడీపీ శ్రేణులు కృషిచేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ 45 రోజుల పాటు కార్యక్రమం జరుగుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్టు ఆయన తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి

కాజులూరు మండల పరిషత్ సమావేశంలో మంత్రి వేణు



కాజులూరు మండల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర సమాచార, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మంత్రి వేణుగోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని 26 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. సమావేశం నిర్వహణ బాధ్యతలు చేపట్టిన మంత్రి వేణుగోపాలకృష్ణ.. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిపై సభ్యులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, అభివృద్ధి పనులకు భారీఎత్తున నిధులు విడుదల చేస్తున్నట్టు వివరించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు, తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యమిస్తూ, జలజీవన్ మిషన్ ద్వారా ధవళేశ్వరం నుంచి శుద్ధి చేసిన గోదావరి జలాలను గ్రామాల్లోని వాటర్ ట్యాంకులకు, అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా ప్రతి ఇంటికీ సరఫరా చేసేలా చర్యలు చేపట్టారని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.27.33 కోట్ల వ్యయంతో మండలంలో 30 ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయని, త్వరలో మిగిలిన వాటిని పూర్తిచేసి, ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు సరఫరా చేస్తామని వెల్లడించారు. సమావేశంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, మాత మురళి, వైస్ ఎంపీపీలు వి.విజయ, పెదిరెడ్డి వెంకటరమణ, ఆర్‌ఎంసీ చైర్మన్ పండుల గోవిందరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 30న నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అజెండాపై చర్చిస్తారని ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు హాజరుకావాలని కోరారు.

అంగరలో అన్న సంతర్పణ

కపిలేశ్వరపురం: దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అంగరలోని తాతపూడి రహదారిలో ఉన్న శ్రీకనకదుర్గ ఆలయం వద్ద శుక్రవారం అన్న సంతర్పణ నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరం

గుడ్‌మార్నింగ్‌లో మంత్రి వేణు



రాజబాబునగర్‌లో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం అవసరమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని రాజబాబునగర్‌లో శుక్రవారం ఉదయం ఆయన గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైన్లు, వీధిలైట్ల సమస్యలు, రక్షిత మంచినీటి సరఫరా తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే మున్సిపాలిటీ అధికారులు సూచించిన విధంగా చెత్తను పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వీధుల్లో మురుగు నీటిని రోడ్లపైకి విడిచిపెట్టకుండా, డ్రైనేజీలను వినియోగించాలన్నారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని, ఇలాంటివి ఉంటే.. మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. మురుగు నిల్వల వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్, విద్యుత్ ఏఈ ఎంవీ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజు, కౌన్సిలర్ కేతా శ్రీను, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు బావాల భద్రరావు, గుబ్బల రాంబాబు, కంచుమర్తి బాబూరావు, కుక్కల శ్రీను, దిగుమర్తి వీరబాబు, కొండేపూడి సురేష్, కుడిపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నిలయంగా కుంతీదేవి ఆలయం



కుంతీదేవి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: అంగరలో నిర్మించనున్న కుంతీదేవి ఆలయం ఆధ్యాత్మిక నిలయంగా నిలుస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అంగర దళితవాడలో రూ.10 లక్షలతో నిర్మించ తలపెట్టిన కుంతీదేవి ఆలయానికి ఎమ్మెల్సీ త్రిమూర్తులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ అద్దాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ తోటకు గ్రామ దళిత నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘాల చైర్మన్లు గంగుమళ్ల రాంబాబు, గుడిమెట్ల శివరామకృష్ణ, దళిత నాయకులు బడుగు ఏడుకొండలు, చిల్లా లోవరాజు, పోలినాటి శ్రీనుప్రసాద్, జక్కల శ్రీనివాస్, పిల్లా సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పసలపూడి శ్రీనివాస్, తిరునాతి వెంకటేశ్వరరావు, పెద్దింశెట్టి రామస్వామి, వాసంశెట్టి వాసు, టి.సుభాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంపీఎస్ పునఃప్రారంభం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పట్టణంలోని మండపేట పబ్లిక్ స్కూల్ (ఎంపీఎస్) శనివారం పునఃప్రారంభం కానున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించామన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబుతో కలిసి ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడారు. యాజమాన్య హక్కు విషయమై ఎంపీఎస్ భాగస్వాముల మధ్య నెలకొన్న వివాదంతో రెండు రోజులుగా పాఠశాల తెరుచుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టర్ హిమాన్షుశుక్లా, విద్యాశాఖ అధికారులతో మాట్లాడినట్టు ఆయన తెలిపారు. డీఈఓ ఎం.కమల కుమారి, ఇతర అధికారులను పిలిపించి ఎంపీఎస్ స్కూల్‌కు పంపించామన్నారు. శనివారం నుంచి ఎప్పటిలాగే తరగతుల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఇద్దరు భాగస్వాముల మధ్య వాటాల విషయమై విభేదాలు ఉన్నాయన్నారు. స్కూలు వివాదంపై సామాజిక మాధ్యమాల్లో కొందరు ఇష్టానుసారం దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు అధిక ప్రాధాన్యమిస్తామని, వారికి అన్నివిధాలా అండగా ఉంటానని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. రాజుబాబు మాట్లాడుతూ పాఠశాల భాగస్వాముల మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వీరి వివాదాన్ని పక్కన పెట్టి, స్కూల్ తెరిపించేందుకు ఎమ్మెల్సీ తోట చొరవ చూపారన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను తల్లిదండ్రులెవరూ నమ్మవద్దని, త్వరలో వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమిది

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ద్వారపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఏడాదిలోనే అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఈత కోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన ద్వారపూడిలో పర్యటించారు. వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, జెడ్పీటీసీ కుడిపూడి భవాని, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ తదితరులతో కలిసి ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి, స్థానికులతో మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా ప్రతి ఇంటికీ, అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేరాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పథకాల కోసం వారి నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వంలో వలంటీర్లు నేరుగా ఇంటికి వచ్చి పథకాలను అందజేస్తున్నారని, ఎక్కడిక్కడ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ పోతుల రాంబాబు, వార్డు సభ్యులు యరగతపు విజయ్, సంగిశెట్టి రమేష్, పార్టీ నాయకులు సత్తి సత్తిబాబు, పోతుల దుర్గాప్రసాద్, పలివెల సుధాకర్, పోలినాటి సత్యనారాయణ, దండుబోయిన సూర్యనారాయణమూర్తి, నామాల వెంకన్న, పుట్టపూడి సత్తిబాబు, సత్తి రాంబాబు, నామాల శ్రీనివాసరావు, తొంటాపు సత్తిపండు, గూడూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన చెల్లుబోయిన నరేన్



వెలంపాలెంలో వైద్య శిబిరం ప్రారంభిస్తున్న నరేన్, ఎంపీపీ భవాని తదితరులు

రామచంద్రపురం రూరల్: ప్రజలు స్వల్ప అనారోగ్యాన్ని నిర్లక్ష్యం చేసి, ప్రాణాంతక పరిస్థితులు తెచ్చుకోరాదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు చెల్లుబోయిన నరేన్ పేర్కొన్నారు. మండలంలోని వెలంపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ ఎస్.లక్ష్మి, స్థానిక నాయకులు టేకుమూడి సత్యనారాయణతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేన్ మాట్లాడుతూ పేదరికం కారణంగా, దూరాభారంతో చాలామంది బీపీ, మధుమేహం వంటి వాటిని అశ్రద్ధ చేస్తున్నారని చెప్పారు. దీంతో గుండెపోటు వంటి ఇబ్బందులను తెచ్చుకుంటున్నారని, అందువల్లే ప్రభుత్వం వైద్య సిబ్బందిని ఇంటింటికీ పంపి.. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని వివరించారు. డాక్టర్ టీఎస్ సందీప్‌నాయుడు, డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ లిథియ, డాక్టర్ టి.ఆనంద్, నేత్ర వైద్య నిపుణుడు ధర్మవరపు కోటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ నార్ని గంగాధర్, సీహెచ్‌ఓ వీరవేణి, పీహెచ్‌ఎన్ సుబ్బలక్ష్మి, హెచ్‌వీ వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు సేవలందించారు. గ్రామంలోని 392 మందిని పరీక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, పీఏసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజు, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, అంబటి తుకారం, పిల్లి రాంబాబు, ఎంపీటీసీ రెడ్నం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో ఆరోగ్య భాగ్యం

కె.గంగవరం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని తాళ్లపోడు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టినట్టు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయాల పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి, పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచారని వివరించారు. ప్రస్తుతం ఆరోగ్య సురక్షలో ప్రతిఒక్కరికీ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో 229 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. 11 మందిని మెరుగైన చికిత్సకు పెద్ద ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. సర్పంచ్ చప్పిడి శ్రీనివాస్, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, ఎంఈఓ నాగరాజు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు పాల్గొన్నారు.

వడ్లమూరులో జగనన్న ఆరోగ్య సురక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి



శిబిరంలో సేవలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వడ్లమూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 495 మందికి వైద్య పరీక్షలు చేశారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యులు డా.గవర శ్రీదుర్గ, డా.కరుణేంద్రకుమారి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్ చుండ్రు మంగాయమ్మ, ఎంపీటీసీ పలివెల మధు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తదితరులు సేవలను పర్యవేక్షించారు. చిన్నారుల, గర్భకోశ, జనరల్ సర్జరీ, నేత్ర, ఎముకల, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్ తదితర ఆరోగ్య సమస్యలను పరీక్షించారు. నలుగురికి ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స చేయించాలని నిర్ణయించారు. అంగన్‌వాడీలు పౌష్టికాహార స్టాళ్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి రుద్రమూర్తి, మాకన మాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కుడుపూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

కె.గంగవరం: మండలంలోని కుడుపూరులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో వైద్యులు అందుబాటులో ఉంటారని చెప్పారు. సచివాలయం పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో వివిధ వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, మందులు అందిస్తారని తెలిపారు.

గౌతమి పాత బ్రిడ్జిపై కారు బోల్తా

రావులపాలెం: జాతీయ రహదారిపై స్థానిక గౌతమి గోదావరి పాత బ్రిడ్జిపై శుక్రవారం మారుతీ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరానికి చెందిన పురిల్ల బాలు రాజమహేంద్రవరంలో ఉన్న తన యజమానిని ఆసుపత్రి నుంచి కారులో ఎక్కించుకుని వచ్చేందుకు బయలుదేరాడు. మార్గంమధ్యలో రావులపాలెం పాత బ్రిడ్జిపై ముందుఉన్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోతూ, అదుపుతప్పి డివైడర్‌ని కారు ఢీకొంది. ఈ ఘటనలో కారు బోల్తా పడడంతో, కారులో ఉన్న డ్రైవర్ బాలుకు స్వల్ప గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది సంఘటన చేరుకుని, క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించారు. క్రేన్ సాయంతో కారును తొలగించారు.

పీఎంపీ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



రాయవరం పీఎంపీ కన్వీనర్‌గా ఎంపికైన వెంకటరమణ, కోకన్వీనర్లు జగదీష్, శివ

రాయవరం: రాయవరం, అనపర్తి, బిక్కవోలు మండలాల పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం రాయవరంలో నిర్వహించారు. స్థానిక వెలమ కమ్యూనిటీ భవనం ఆవరణలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ గంగుమళ్ల రాంబాబు, జిల్లా కోకన్వీనర్ బళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగాయి. రాయవరం మండలం నూతన కమిటీ కన్వీనర్‌గా నౌడు వెంకటరమణ, కోకన్వీనర్లుగా చింతా జగదీష్, ఎస్.శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనపర్తి, బిక్కవోలు మండల కన్వీనర్‌గా వాసంశెట్టి నాగేశ్వరరావు, కోకన్వీనర్లుగా డి.సాయి రామారెడ్డి, నీలంశెట్టి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథి కాకినాడకు చెందిన మెడికవర్ హాస్పిటల్ వైద్య నిపుణుడు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో పీఎంపీలు రోగులకు అందించే వైద్య సేవలు ఎంతో అమూల్యమైనవన్నారు. పీఎంపీ నేతలు కేవీ వెంకటరెడ్డి, పరంశెట్టి శ్రీనివాస్, కేవీజీకేరెడ్డి, రాయవరం, అనపర్తి, బిక్కవోలు మండలాల పీఎంపీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామ పాదుకలకు గ్రామోత్సవం



వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రీరామ పాదుకలకు పూజలు చేస్తున్న దృశ్యం

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠానికి శుక్రవారం రామభక్తుడు శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో శ్రీరామ పాదుకలను తీసుకువచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠ చేయనున్న ఈ పాదుకలను పీఠం ప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి విజయదుర్గా పీఠం వరకూ మేళతాళాలతో గ్రామోత్సవం జరిగింది. అనంతరం పీఠంలోని సీతారాముల ఉత్సవ విగ్రహాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ రామ మందిరం నిర్మాణం కోసం నాలుగు వెండి ఇటుకలు ఇచ్చినట్టు తెలిపారు. వెండి పాదుకలను దేశవ్యాప్తంగా వివిధ పుణ్యక్షేత్రాల్లో ఉంచి, పూజలు చేసినట్టు వివరించారు. ఇక్కడి నుంచి పాదయాత్రగా బయలుదేరి, భద్రాచలం శ్రీసీతారామ సన్నిధిలో పూజలు చేయనున్నట్టు తెలిపారు. వెండి పాదుకలకు బంగారు తాపడం చేయించి, మూడు నెలల పాటు పాదయాత్రగా వెళ్లి జనవరి 15న యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేతుల మీదుగా అయోధ్య మందిరానికి అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పి.సత్యకనకదుర్గ, బి.రమ తదితరులు పాల్గొన్నారు.